

క్లుప్తంగా

వీధి విక్రయదారుల ఫెడరేషన్ నూతన కమిటీ

తిరుపతి కల్చరల్: వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్‌డీ.రవి, అధ్యక్షుడుగా మునిబాలాజీ, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.సరితమ్మ, కోశాధికారిగా ఎస్.శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రామ్మూర్తి, వెంకటరమణ, అహ్మద్ బాషా, కాంచనమ్మ, ఎం.విజయ్‌కుమార్, శంకర్, సహాయ కార్యదర్శులుగా రమేష్, దీపక్, తులసీరామ్, సంజీవయ్య, ఎలుమలై, హరితో పాటు 18 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేసినట్లు ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.శివకుమార్ తెలిపారు.

యూపీఎస్ విధానాన్ని కూటమి వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర నేత కిరణ్

తిరుపతి కల్చరల్: సీపీఎస్ ఉద్యోగులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన యూపీఎస్ విధానాన్ని కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తుంటే, కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం దారుణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానానికి బదులు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ అనే కొత్త విధానానికి గెజిట్ విడుదల చేసిందని, ఇది యూపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తుకు ఉరితో సమానమని, ఆ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు ఎంత నష్టదాయకమో వివరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంకీపురం పవన్ మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి, భరత్, శేఖర్, మహిళా అధ్యక్షురాలు రేఖ పాల్గొన్నారు.

మురుగు సాఫీగా వెళ్లేలా చెత్త తొలగించండి

- మున్సిపల్ కమిషనర్ మౌర్య ఆదేశం


ఆకస్మిక తనిఖీ చేస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలో అన్ని కాలువల్లో మురుగునీరు సాఫీగా వెళ్లేలా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని ఖాదీకాలనీ, ప్రకాశం పార్కు రోడ్డు, శివజ్యోతి నగర్ తదితర ప్రాంతాలను కార్పొరేటర్లు శేఖర్ రెడ్డి, అనీష్, ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని మురుగునీటి కాలువల్లో చెత్త వల్ల నీరు ఆగి పోతోందని, ఫలితంగా దోమల మోతతో ఇబ్బందులు పడుతున్నట్టు ఎక్కువగా తమకు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితి తలెత్తకుండా కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అక్కడక్కడా పెద్ద కాలువల్లో గ్యాంగ్ వర్క్ చూపించాలని అధికారులకు సూచించారు. పాడైన కాలువలు మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలనే ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలు కాలువల్లో చెత్త వేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే తమ సిబ్బందికి తడి, పొడి చెత్తను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ రమణ, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసీపీ బాలాజీ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


ఎంపీ గురుమూర్తి, సినీ గాయని సునీత

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, సినీ గాయని సునీత, బొమ్మిది నాయకర్, ఎమ్మెల్యే ధర్మరాజు, తెలంగాణ ఎమ్మెల్సీ రగోతం రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

ఆగమ గ్రంథాల సంరక్షణ సంస్కృత వర్సిటీదే

తిరుపతి సిటీ: అంతరించిపోతున్న ఆగమ గ్రంథాలను సంరక్షించాల్సిన బాధ్యత సంస్కృత వర్సిటీదేనని చెన్నైకి చెందిన శైవాగమ విద్వాంసులు ఆచార్య సోమశేఖర్ గురుకుల్ అన్నారు. మంగళవారం జాతీయ సంస్కృత వర్సిటీలో వైఖానస, పాంచరాత్ర, శైవ అర్చకులకు అర్చనం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభంలో గౌరవ అతిథిగా ఆయన ప్రసంగించారు. ఆగమ అర్చన వైశిష్ట్యాన్ని మరింత ప్రోత్సహించేందుకు వర్సిటీలో సదస్సులు నిర్వహించడం శుభపరిణామన్నారు. ఆగమాలు అర్చనా సంస్కృత పఠనం, జ్యోతిషం, యోగం, జ్ఞానం వంటి అంశాలపై చర్చించడమే సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, విద్యాపీఠంలో ఆగమ విభాగం ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిందన్నారు. ఈ విభాగం నుంచి 50కి పైగా గ్రంథాలు, 30కి పైగా పీహెచ్‌డీలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. పలు సదస్సులు, వర్క్‌షాపులు, ఆగమ పండిత సన్మానాలు, దిగ్విజయంగా నిర్వహించామని చెప్పారు. టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడారు. సదస్సులో విభాగాధిపతి విష్ణుభట్టాచార్యులు, డాక్టర్ చావలి పవన్ వంశీ, ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ పీటీజీ రంగరామానుజాచార్యులు, నల్లకూర్మన్న భట్టాచార్యులు, కె మోహన్, హరిహర పంత్, వెంకట పెరుమాళ్ దీక్షితులు పాల్గొన్నారు


సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన వక్తలు




టాక్సీ కార్మికులకు సంక్షేమ బోర్డు ప్లీజ్!


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: టాక్సీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో టాక్సీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ మంగళవారం గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ, టాక్సీ డ్రైవర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, మరోవైపు పోలీసుల వేధింపులు, పెనాల్టీ చలానాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టాక్సీ వర్కర్స్ యూనియన్ నేతలు బాల, రమేష్, మల్లిఖార్జునరెడ్డి, దినేష్, బాషా, రమణ, మునిచంద్ర, సురేష్, భాస్కర్, నాగార్జున నాయక్, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నేతలు పాల్గొన్నారు.









క్లుప్తంగా

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోరూ!

తిరుపతి కల్చరల్: తమకు పితార్జితంగా సంక్రమించిన భూమిని కొందరు దౌర్జన్యంగా కబ్జా చేశారని బాధితులు తమ గోడు నివేదించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సి.రామాపురానికి చెందిన బాధితులు సుబ్రమణ్యంరెడ్డి, రాజేశ్వరి మాట్లాడారు. రామచంద్రాపురం మండలం, సి.రామాపురం గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 163/1లో88 సెంట్లు, 163/3లో 40 సెంట్లు భూమి తమ ఆధీనంలో ఉందన్నారు. అయితే గ్రామస్తులు రామ్మూర్తిరెడ్డి, నరేంద్రబాబు రెడ్డి రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో సర్వే నంబర్ 163/3లో 14 సెంట్ల భూమిని ఆక్రమించి మొక్కలు నాటుతున్నారని, దీనిపై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి దిగడమేకాక, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సైతం వారికి వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. దీనిపై కోర్టులో కేసు వేశామని, జిల్లా అధికారులైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో మీనాక్షమ్మ, మమత పాల్గొన్నారు.

సమీక్షలతో పనుల వేగం పెంచాలి

పాకాల: ఎప్పటికప్పుడు సమీక్షలతో అధికారులు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లోకనాథం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం ఇవ్వాలన్నారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పాకాలకు నీటిని తీసుకొచ్చేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఇదలా ఉంచితే, తమ పొలాల్లోని టేకు, వేప చెట్లను అవసరాల నిమిత్తం కోసుకువెళ్తుంటే అటవీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ సంతోష్ సాయి, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో 'ఉమెన్ సస్టైనబులిటీ–ఎమర్జింగ్ స్ట్రాటజీస్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. సోషల్ వర్క్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ పి.తవితా తులసి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సావనీర్‌ను వీసీ ప్రొఫెసర్ వి.ఉమ, రిజిస్ట్రార్ రజిని, డీన్ ప్రొఫెసర్ పి.వాణి, ప్రొఫెసర్ గురుప్రీత్ కౌర్ ఆవిష్కరించారు. వివిధ అంశాలపై వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పరిశోధనల పత్రాలను సమర్పించారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్: కల్లుగీత కార్మికులకు రూరల్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కేటాయించిన మద్యం దుకాణానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సర్కిల్ సీఐ నరసానాయుడు తెలిపారు. మంగళవారం రూరల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 5వ తేదీలోపు అర్హులైన వారు తమ కులధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.2 లక్షలను నాన్–రీఫండబుల్ అప్లికేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని, ఎంపికైన వారికి రెండేళ్ల పాటు లైసెన్స్ ఉంటుందని, 2024–25 ఏడాదికి రూ.21,66,667లు, 2025–26 ఏడాదికి రూ.35.75 లక్షలను లైసెన్స్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఎంఆర్‌పల్లె సర్కిల్లోని తమ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఓటేరులో అగ్నికి ఆహుతైన సచివాలయాన్ని పరిశీలిస్తున్న సర్పంచులు

తిరుపతి రూరల్: ఓటేరు గ్రామ సచివాలయ భవనానికి నిప్పు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి రూరల్ మండల సర్పంచులు డిమాండ్ చేశారు. ఓటేరు పంచాయతీలో అగ్నికి దెబ్బతిన్న సచివాలయాన్ని మంగళవారం సర్పంచులు డీవీ రమణ, కోటేశ్వరరావు, రాజా, సుబ్రమణ్యంరెడ్డి, సీవీ రమణ తదితరులు పరిశీలించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు ప్రజా దేవాలయాలని, అలాంటి వాటికి నిప్పు పెట్టి తగలబెట్టడం క్షమించరాని నేరం అన్నారు. నిందితులు ఎవరైనా సరే పోలీసులు కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓటేరు, లింగేశ్వర్‌నగర్, బ్రాహ్మణపట్టు, అవిలాల సర్పంచులు లక్ష్మీరాజ, ఎం.కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం రెడ్డి, సీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

– 4న రథసప్తమి వేడుకలు

చంద్రగిరి: ఫిబ్రవరి 4న రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి..ఇత్యాది వాటిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. రథసప్తమి, పవిత్రోత్సవాలు, వసంతోత్సవాలు, బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం పరిపాటి.

ఫిబ్రవరి 4న రథసప్తమి

ఫిబ్రవరి 4న మంగళవారం రథసప్తమి సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంతో వాహనసేవలు ప్రారంభమవుతాయి. అప్పటి నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అమ్మవారు హంస, అశ్వ, గరుడ, చిన్నశేష వాహనాలపై ఊరేగనున్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 – 9.30 గంటల వరకు గజ వాహనాలను అధిష్ఠించి అమ్మవారు దర్శనమిస్తారు. రథసప్తమి కారణంగా ఫిబ్రవరి 4న ఆలయంలో శ్రీ అమ్మవారి ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవం, కుంకుమార్చన, ఊంజల్ సేవ, వేదాశీర్వచనం సేవలతోపాటు బ్రేక్ దర్శనాన్ని రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అనుబంధ శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామివారు అశ్వవాహనాన్ని అధిష్ఠించి భక్తులకు అనుగ్రహిస్తారు.



అమ్మవారి ఆలయంలోని గోడలకు పవిత్ర జలాన్ని ప్రోక్షణ చేస్తున్న ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్



ఆలయ ధ్వజస్తంభాన్ని నీటితో శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

అమ్మవారికి పరదాలు సమర్పణ



అమ్మవారికి పరదాలను సమర్పిస్తున్న దాతలు

హైదరాబాద్‌కు చెందిన వెంకట రామప్రసాద్ శర్మ దంపతులు పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం 8 పరదాలను సమర్పించారు. వీటిని డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అర్చకులు బాబు స్వామికి దాత అందజేశారు. అమ్మవారి గర్భాలయంలో పరదాలను అలంకరించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాలెడ్జ్ సిస్టమ్‌కు అగస్త్య మహర్షి ఎనలేని కృషి



సదస్సుకు హాజరైన ప్రముఖులు

తిరుపతి సిటీ: భారతీయ నాలెడ్జ్ సిస్టమ్(ఐకేఎస్)కు అగస్త్య మహర్షి చేసిన కృషి ఎనలేనిదని చెన్నై సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ అరుణ సుందరం కీర్తించారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మంగళవారం కాశీ తమిళ సంగం 3.0లో భాగంగా అగస్త్య మహర్షిపై నిర్వహించిన జాతీయ సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన ప్రసంగించారు. భాషాశాస్త్రం, వైద్యం, ఖగోళ శాస్త్రం, ఆధ్యాత్మిక జ్ఞానానికి అగస్త్య మహర్షి కృషి మరువలేనిదని, భావి భారతానికి జాతీయ సదస్సులతో తెలియజేయడం శుభపరిణామన్నారు. మణిమేగలై వంటి గ్రంథాలతో పాటు రుగ్వేదం, రామాయణం, మహాభారతం, బౌద్ధమతంలోని జ్ఞానాన్ని అందించారన్నారు. సదస్సులో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ప్రొఫెసర్ గణపతి భట్, ప్రొఫెసర్ శంకర నారాయణన్, ప్రొఫెసర్ దేవనాథన్, అధ్యాపకులు రంగనాథన్, వైష్ణవి, రాజేష్ కుమార్, రాజగోపాలన్, చంద్రశేఖర్, మురళీకృష్ణ, రామచంద్రన్ పాల్గొన్నారు

గోరక్షణతో దేశ సంరక్షణ

- కశ్మీర్ నుంచి తిరుపతికి చేరుకున్న గోమాత పాదయాత్ర



గోమాత పాదయాత్రకు హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు

తిరుపతి కల్చరల్: గోరక్షణ, భూ సంరక్షణ, దేశ సుభిక్షతను కాంక్షిస్తూ బాలకృష్ణ గురుస్వామి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోమాతతో నిర్వహిస్తున్న పాదయాత్ర మంగళవారం తిరుపతికి చేరుకుంది. తొలుత మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం వద్ద స్థానికులు, రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన సభ్యులు గోమాత పాదయాత్రకు హారతులు పట్టి స్వాగతం పలికారు. గోమాత పాదయాత్రికుడు బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ, భూ సంరక్షణ గోమాత రక్షణతోనేనని, భరతభూమి రక్షణతో దేశం సుభిక్షంగా వర్ధిల్లుతుందన్నారు. గోమాతను సంరక్షించి తద్వారా భరత భూమి సారవంతమైన భూమిగా పర్యావరణం పరిమళించడంతో దేశం, మానవాళి సుభిక్షంగా ఉంటుందనే నినాదంతో గోమాతతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 180 రోజుల పాటు 14 రాష్ట్రాల మీదుగా సుమారు 4,900 కిలోమీటర్లు పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇప్పటికే పది రాష్ట్రాల మీదుగా సుమారు 3,710 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుపతికి చేరుకున్నామన్నారు. తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తర్వాత ఇక్కడ నుంచి పాదయాత్రను కన్యాకుమారికి కొనసాగిస్తామన్నారు. తాము ఆధ్యాత్మిక చింతనతో గోమాత, సనాతన ధర్మ పరిరక్షణ కోసం చేస్తున్న పాదయాత్రకు ప్రజలు చూపుతున్న ఆదరణ మరువలేనిదన్నారు. ప్రజలందరూ గోమాతను పరిరక్షించి పూజించి ఆదరించాలని పిలుపు నిచ్చారు. అనంతరం అక్కడ నుంచి లీలామహల్ సర్కిల్ మీదుగా కపిలతీర్థం, అలిపిరి వరకు గోమాత పాదయాత్ర సాగించారు.

కాసుల మత్తు



- ఆ వైన్ షాపుపై అంత ప్రేమ ఎందుకో?

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తాటితోపు సమీపంలోని వైన్ షాప్‌పై ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక ప్రేమను చూపుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెర్లోపల్లికి చెందిన ఓ రాజకీయ నేత కోసం మద్యం దుకాణానికి ప్రత్యేక పరిమితులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తిరుపతి–చిత్తూరు రహదారికి సమీపంలోనే వైన్ షాపులో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు జాతీయ, రాష్ట్ర రహదారులకు 220 మీటర్ల తర్వాత మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఆ వైన్ షాపునకు మాత్రం కేవలం 110 మీటర్ల లోపే దుకాణం తెరిచి, యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నారు. ఎందుకు ఇలా అని ప్రశ్నిస్తే తిరుపతి రూరల్ ఎక్సైజ్ అధికారులు జిల్లా అధికారులు ప్రత్యేక అనుమతులు ఇచ్చారని చెప్తున్నారు. కానీ ఎందుకు అని మాత్రం ఒకరిపై మరొకరు నెపం నెట్టుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యేకం ఏమిటని సాక్షి పరిశీలన చేసింది. అయితే వైన్ షాపునకు సమీపంలోకి పేరూరు చెరువు నీళ్లు వచ్చాయి. ఇక్కడే రూరల్ ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారితో కుమ్మక్కయ్యారు. జిల్లా ఎక్సైజ్ అధికారుల కళ్లకు గంతలు కట్టారు. వైన్ షాపు చెరువు నీటితో మునిగిపోయినట్లు, మార్చుకునేందుకు అవకాశం కల్పించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సిఫార్సు చేశారు. దీంతో ఆయన ప్రత్యేక పర్మిషన్ ఇచ్చారు. ఇక్కడ కూడా మద్యం వ్యాపారి, ఎక్సైజ్ అధికారులు కుమ్మక్కయ్యారు. రోడ్డుకు 220 మీటర్లకు దూరంగా షాపును నడపాల్సి ఉన్నా కూడా నిబంధనలకు విరుద్ధంగా 110 మీటర్ల లోపే దుకాణం తెరిచేలా అవకాశం కల్పించి, అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. రోడ్డుకు దగ్గరగా వ్యాపారం చేసుకునేలా వైన్ షాపునకు ప్రత్యేక అనుమతులు ఇవ్వడంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే తమకు కూడా రోడ్డుకు సమీపంలో మద్యం దుకాణం పెట్టుకునేలా అనుమతులు ఇవ్వాలని పలువురు మద్యం వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడును వివరణ కోరగా ఎస్ఐ వెళ్లి పరిశీలించారని, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పర్మిషన్ ఇచ్చారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే బుధవారం తాను స్వయంగా వెళ్లి పరిశీలిస్తానని చెప్పారు.




తాటితోపు సమీపంలోని వైన్ షాపు

వ్యవసాయ రంగంలో యువతకు ఉపాధి

ఆరోగ్యకరమైన పంటలు, అధిక దిగుబడులతో లాభాలు సాధించాలంటే సుభాష్ పాలేకర్ క్రిషి పద్ధతులు(ఎస్‌పీకే) వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున చేపట్టాలి. నేటి యువత వ్యవసాయ రంగంపై దృష్టి సారిస్తే ఊహకందని రీతిలో ఆర్థికాభివృద్ధి చెందుతారనడంలో సందేహం లేదు. యువత ఉపాధి కోసం వలస వెళ్లి ఆశించిన ఉపాధి లభించకపోవడంతో మానసిక ఒత్తిడికి లోనై తనువు చాలించడం బాధాకరం. భారతదేశంలో రసాయన రహిత ఆహారం ప్రజలకు అందించాలనేది తన అంతిమ లక్ష్యమని వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సుభాష్ పాలేకర్ చెప్పారు. మహిళా వర్సిటీ, ఎస్వీయూలో పలు జాతీయ సదస్సులకు హాజరయ్యేందుకు తిరుపతికి విచ్చేసిన ఆయన మంగళవారం 'సాక్షి'తో పలు అంశాలపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– తిరుపతి సిటీ



- రైతు బిడ్డను వివాహమాడేందుకు విముఖత చూపడం బాధాకరం
- అన్నదాతలకు ఉపాధిపై పాలకులు పార్లమెంట్, అసెంబ్లీలలో గళం వినిపించాలి
- ప్రత్యేక ఇంటర్వ్యూలో పద్మశ్రీ డాక్టర్ సుభాష్ పాలేకర్

ఉపాధి అవకాశాలను హరించివేస్తున్న ఆధునిక టెక్నాలజీలు

ప్రాచీన కాలంలో రైతులు రసాయన రహిత వ్యవసాయం చేసి దేశానికి ఆహారాన్ని అందించారు. గతంలో యువతకు ఉద్యోగావకాశాలు లభించకుంటే వ్యవసాయ రంగంలో రాణిస్తూ ఉపాధి పొంది భావిభారతానికి దిక్సూచిగా నిలిచారు. ఆధునికత పేరుతో టెక్నాలజీని వ్యవసాయ, పారిశ్రామిక రంగంలో విచ్చలవిడిగా వినియోగించడంతో ఉపాధి అవకాశాలకు గండిపడింది. లక్షలు వెచ్చించి డిగ్రీలు చదివిన యువత వలసబాట పట్టారు. ఆశించిన అవకాశాలు లభించకపోవడంతో వ్యసనాలకు లోనై తనువు చాలిస్తున్నారు. ఇది దేశానికి ప్రమాదకరం.

యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఆసన్నమైంది

కరోనా తర్వాత ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. రసాయన రహిత ఆహారం కోసం ప్రజానీకం ఎదురు చూస్తోంది. దీంతో భవిష్యత్తు వ్యవసాయ రంగానిదని చెప్పవచ్చు. ఆరోగ్యవంతమైన ఆహారోత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. రైతులు తమ పిల్లలను విద్యతో పాటు వ్యవసాయ రంగం వైపు ప్రోత్సహించాలి. ఆర్థికంగా బలపడే రంగం వ్యవసాయ రంగమే. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని మరింత ప్రోత్సహించి యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి.

రైతులపై పడుతున్న యాంత్రీకరణ ప్రభావం

రైతు బిడ్డ వ్యవసాయ రంగంలో రాణిస్తూ ఆర్థికంగా బలపడినా వివాహానికి అమ్మాయిలు విముఖత చూపడం బాధించే అంశం. దేశానికి ఆహారాన్ని అందించే రైతుపై యాంత్రీకరణ ప్రభావం చూపుతోంది. ప్రతి విద్యార్థి ఏఐ, సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్ అంటూ ఉన్నత డిగ్రీ పట్టాలు పొంది లక్షల మంది ఉపాధి లేకుండా కడుపు నింపుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పాలకులు వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు పార్లమెంట్, అసెంబ్లీ వేదికలల్లో గళం విప్పాల్సిన అవసరం ఉంది.

అగ్రి సెక్టార్‌పై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఎస్‌పీకే పద్ధతుల్లో వ్యవసాయం దేశానికి అవసరం

ప్రకృతి వ్యవసాయం, ఎస్‌పీకే వ్యవసాయ పద్ధతులకు భారీ వ్యత్యాసం ఉంది. రెండు ఒకటేననే చాలా మంది అసత్య ప్రచారం చేయడం బాధిస్తోంది. ప్రాచీన పద్ధతుల్లో ఆహార పంటలు పండించే పద్ధతులపై ఎన్నో పరిశోధనలు చేసి సుభాష్ పాలేకర్ క్రిషి వ్యవసాయ పద్ధతులను తీసుకొచ్చాం. సరైన పద్ధతులను పాటించి ఆరోగ్యకరమైన పంటల దిగుబడిని సాధించి లాభసాటి వ్యవసాయం సాగుచేయడమే ఎస్‌పీకే ప్రధాన లక్ష్యం. గత 8ఏళ్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాల్లో ఎస్‌పీకే పాటించే రైతులు లక్షల్లో లాభాలను పొందుతున్నారు. ఆరోగ్యకర, రసాయన రహిత ఆహారాన్ని సమాజానికి అందిస్తున్నారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని గడగడలాడించిన నాటి నుంచి గోమూత్రం, జీవామృతం ఎరువులుగా సాంప్రదాయ పద్ధతులతో సాగు చేసిన ఆరోగ్యకరమైన ఆహార పంటల కోసం ప్రస్తుత సమాజం ఎదురుచూస్తోంది. గ్రామీణ రైతుకు ఎస్‌పీకేపై అవగాహన కల్పించేందుకు యువతకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

- సూపర్ సిక్స్‌తో ప్రజలను నిండా మోసం
- కూటమి ప్రభుత్వంపై సీపీఎం జిల్లా కార్యదర్శి విమర్శ



రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్: నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీలలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర 27వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందారపు మురళి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పేదలు, కార్మికులు, కష్టజీవులు, ఉద్యోగ కార్మికుల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారానికి సీపీఎం రాజీలేని పోరాటాలు సాగిస్తోందన్నారు. నెల్లూరు మహాసభలకు సీపీఎం అగ్ర నాయకత్వం బృందాకరత్, ఎంఏ.బేబీ, బీవీ. రాఘవులు ముఖ్య అతిథులుగా ప్రసంగిస్తారన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధి ఊదరగొట్టి చేస్తామని అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలను నిండా మోసం చేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహాసభల్లో పలు అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, వేణుగోపాల మాధవ్, బుజ్జి, చిన్న, నరేంద్ర, రమేష్, రాజు, మల్లిఖార్జున్‌రావు, ఎండీ.శ్రీనివాసులు, మునిరాజ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి



సీ.గొల్లపల్లెలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ మాధవరెడ్డి

తిరుపతి రూరల్ : ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సీ.గొల్లపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. సచివాలయాల పరిధిలోని ప్రజలు హాజరై ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నారు. ఆధార్ లేని చిన్న పిల్లలకు కొత్తగా నమోదు చేశారు. బుధవారం కూడా ఈ కేంద్రం సేవలు అందిస్తుందని, సీ.గొల్లపల్లె, పాతకాల్వ, పైడిపల్లె గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విడుదల రవి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమలలో వాహనాల తనిఖీ

తిరుపతి క్రైం : తిరుమలలో ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారులు కలిసి మంగళవారం సంయుక్త దాడులు నిర్వహించారు. రికార్డులు లేని 12 కార్లను స్వాధీనం చేసుకున్నారు. వాటికి 47, 500 జరిమానా విధించి వదిలేశారు.

నేటి నుంచి భారత రాజ్యాంగ వజ్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: అంబేద్కర్ భవన్, ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు అంబేద్కర్ భవన్‌లో భారత రాజ్యాంగ వజ్రోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పి.పరమశివన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ భారత రాజ్యాంగంపై ముఖ్య వక్తల ఉపన్యాసంతో పాటు చర్చా సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. బహుజనులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశు వైద్య శిబిరానికి స్పందన



శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నస్వామిపల్లెలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 120 పశువులకు పిడుదుల నివారణ మందు స్ప్రే చేశారు. 85 దూడలు, 350 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ తాపించారు. 16 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేశారు. రేణిగుంట పశు వైద్యులు డాక్టర్ సునీత, ఆర్.మల్లవరం డాక్టర్ స్రవంతి, వీణ, ఏహెచ్‌ఏ జల్ల మునిక్రిష్ణ, నాదమునిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం


వీరరాఘవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న రిత్విలకులు

నారాయణవనం: స్థానిక కనకవల్లి, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి కనుల పండుగగా నిర్వహించారు. వీరరాఘవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైంది. నాలుగు రోజుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. రాత్రి భక్తజన సందడి నడుమ వేదపండితులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పట్టుశాలి దంపతులు, మహిళలు హాజరై ప్రసాదాలు స్వీకరించారు. బుధవారం సాయంత్రం ఊంజల్‌సేవ, అనంతరం రాత్రి గరుడ వాహనంపై వీరరాఘవస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం, వీధులను విద్యుత్ దీపాలు, దేవతా మూర్తుల ప్రతిమలతో సుందరంగా అలంకరించారు.

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం బెంగళూరు శ్రీజగద్గురు శంకరాచార్య సంస్థానం ద్వారకా బదరీకాశ్రమ పీఠాధిపతి విద్యానారాయణతీర్థస్వామి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు పీఠాధిపతికి స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వేడుకగా అధ్యయనోత్సవాలు

- భక్తి ప్రపత్తులతో దివ్య ప్రబంధ పారాయణం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి అధ్యయనోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఈ అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. మాఘ మాసంలో ఆలయంలో దివ్య ప్రబంధాన్ని పారాయణం చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ప్రతి రోజూ రాత్రి 7.15 గంటలకు ఆలయంలోని కల్యాణ మండపానికి శ్రీదేవి భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి, సేనాధిపతి, ఆళ్వార్లు వేంచేపు చేసి వారి సమక్షంలో దివ్యప్రబంధాన్ని పారాయణం చేస్తారు. ఫిబ్రవరి 7న చిన్న శాత్తుమొర, 13న ప్రణయ కలహోత్సవం, 17న పెద్ద శాత్తుమొర నిర్వహిస్తారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


దివ్య ప్రబంధాన్ని పారాయణం చేస్తున్న అర్చక పండితులు


కల్యాణ మండపంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి, సేనాధిపతి, ఆళ్వార్లు

పరిహారం.. పరిహాసం


నిరసన తెలుపుతున్న రైతు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట విమానాశ్రయం రన్‌వే కోసం తమ నుంచి 2012లో ప్రభుత్వం తీసుకున్న 62 సెంట్ల భూమికి ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదని నిరసిస్తూ బాధిత రైతు ఆర్.వెంకట సుబ్బారెడ్డి అక్కడ పనులను అడ్డుకున్నారు. వివరాలు.. రేణిగుంట మండలం కొత్తపాలెం గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 140/1ఊలో వంశపారం పర్యంగా సంక్రమించిన 2 ఎకరాల డీకేటీ భూమిని ఆర్ వెంకట సుబ్బారెడ్డి సాగు చేస్తున్నారు. 2012లో 63 సెంట్లు, 2015లో 72 సెంట్లు, 2024లో 11 సెంట్ల భూమిని తిరుపతి విమానాశ్రయం అభివృద్ధికి గాను ప్రభుత్వం సేకరించింది. అయితే నష్టపరిహారాన్ని ఇప్పటివరకు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో, ఆ భూమిలో విమానాశ్రయ సిబ్బంది పనులు చేయడానికి మంగళవారం వెళ్లారు. పరిపరిహారం చెల్లించనిదే తమ భూమిలోకి వెళ్లనిచ్చేది లేదని ఆయన అడ్డుకున్నారు.

మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వరదయ్యపాళెం: మండలంలో చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బత్తలవల్లం, మత్తేరిమిట్ట సచివాలయాల్లో స్థానిక మహిళలకు మంగళవారం స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ కోసం మమ్మోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలను నిర్వహించారు. చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనిత, స్విమ్స్ వైద్యులు పద్మావతి, చైతన్యభాను, స్థానిక సర్పంచులు సింధుజ (మత్తేరిమిట్ట), లోకేశ్వరి (బత్తవల్లం), పంచాయతీ కార్యదర్శులు పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా డ్రైవింగ్ చేయండి :

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లు, క్లీనర్లకు అర్బన్ సీఐ శరత్ చంద్ర రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్లో మంగళవారం ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, డ్రైవర్లు, క్లీనర్లతో అర్బన్ సీఐ, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ విద్యను కాపాడుకోవడమే ప్రధాన కర్తవ్యం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి సిటీ: ప్రభుత్వ విద్యను కాపాడుకోవడమే ప్రధాన కర్తవ్యంగా విద్యార్థి సంఘాలు ముందుకు సాగాలని ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్వీయూ వేదికగా ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా స్థాయి మహాసభలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్, ఆచార్య వెంకటేశ్వర్లు ప్రసంగించారు. స్వాతంత్య్రం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా లక్షలాది మంది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు బడికి దూరంగా ఉండటం ఆవేదన కలిగించే అంశమన్నారు. ప్రాథమిక విద్యను అభ్యసించిన విద్యార్థులు చాలా వరకు ఉన్నత విద్య ప్రవేశంలో విఫలమవుతున్నారని, దీంతో డ్రాపౌట్లు పెరుగుతున్నాయన్నారు. వీటి ప్రధాన కారణం విద్యా వ్యాపారం అవ్వడమేనని చెప్పారు. అందరికీ విద్య అందాలంటే అందరికీ సమానత్వం కల కామన్ విద్యా విధానం అమలు చేయాలని, అప్పుడే దేశంలో అనేకమంది బడిలో ఉంటారని, అప్పుడే అందరికీ విద్య అందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో విద్యారంగ సమస్యలపై తాము అవిశ్రాంత పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, నాయకులు వినోద్, నరేంద్ర, తేజ, బాల, ఉమేష్, గురువయ్య పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహిద్దాం

- పీఎం విశ్వకర్మపై కులవృత్తిదారులకు అవగాహన

తిరుపతి అర్బన్: కులవృత్తులను ప్రోత్సహించడమే పీఎం విశ్వకర్మ ముఖ్య లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు అన్నారు. డీఆర్‌డీఏ తిరుపతి కార్యాలయంలో మంగళవారం కులవృత్తుల వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుండలు, పాదరక్షలు, శిల్పం తయారీదారులు, బాస్కెట్ మేకర్, డాల్–టాయ్ మేకర్, లాక్ స్మిత్, హామర్ తయారీదారులు, టూల్ బిట్ మేకర్, ఫిషింగ్ నెట్ మేకర్, బోట్ మేకర్‌కు చెందిన కులవృత్తుల వారు పీఎం విశ్వకర్మ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి అవసరమైన పనిముట్ల కోసం నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం చిన్న, మధ్య తరహా పరిశ్రమల అసిస్టెంట్ డైరెక్టర్(విశాఖపట్నం) వీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ, 18ఏళ్లు నిండిన చేతివృత్తుల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారికి ప్రభుత్వం నుంచి ఐడీ కార్డులు ఇస్తామన్నారు. ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యంత్ర సామగ్రి అవసరమైన వారికి వాటి వినియోగంపై ప్రత్యేక మెళకువలు తెలియజేస్తారన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ, శిక్షణ పొందిన వారికి మొదటి దశలో లక్ష రుణం ఇస్తామని, 18 నెలల్లో ఆ రుణం తీర్చిన వారికి రెండో విడతలో రూ.2 లక్షలు ఇస్తామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మాట్లాడుతూ, శిక్షణ పొందిన వారు తయారు చేసిన వస్తువుల విక్రయాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం గతంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి, జీవనోపాధుల డీపీఎం ధనంజయరెడ్డి, వివిధ విభాగాల అధికారులు ఆదినారాయణ, దూర్వాసుల నాయుడు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, ప్రభురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు


హాజరైన కులవృత్తులకు చెందిన మహిళలు

పోలీసులకిదో సామాజిక సేవ!

'తాగండి..ఊగండి..ఆదాయం పెంచండి' అనే లెవెల్లో ప్రభుత్వం మద్యం విక్రయాలకు అన్ని దారులూ తెరవడంతో మందుబాబులు అండ పిండ బ్రహ్మాండంగా మందుసేవనంలో తరిస్తున్నారు! కాస్త మరుగు స్థలం కనిపిస్తే చాలు అక్కడ మందుబాబులు వాలిపోయి ఎంచక్కా 'చీర్స్ గురూ' అంటూ బాటిళ్లతో తెగ ఖుషీ అయిపోతున్నారు. ఫలితంగా పోలీసులు తలలు పట్టుకుని రంగప్రవేశం చేయాల్సి వస్తోంది. మందుబాబుల భరతం పట్టేమాటెలా ఉన్నా మందుబాబులు గలీజు చేసిన ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో పడ్డారు. మద్యం ఖాళీ బాటిళ్లను సేకరించి దహనం చేస్తున్నారు! ఇక్కడ మద్యం సేవించరాదు అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.


శ్రీకాళహస్తి: ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పోలీసులు.


రేణిగుంట: పరిసర ప్రాంతాల్లో ఇలా..

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): పోలీసుల దృష్టి ఇప్పుడు మందుబాబుల మద్యం సేవిత నిర్జన ప్రాంతాలపై ఫోకస్ పెట్టారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పంచాయతీ సిబ్బంది సహాయంతో రేణిగుంట పరిసర ప్రాంతాలలో ఎక్కువగా మద్యం తాగే ప్రదేశాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మందుబాబులు తాగి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను పోగు చేసి వాటిని కాల్చివేశారు. ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: ప్రభుత్వాస్పత్రి సమీపంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం నిషేధం అని పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పరిసరాలను పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, బాటిళ్లను, ఇతర వ్యర్థాలకు పడవేస్తే చర్యలు తప్పవని, కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం నారాయణవనంలో బహిరంగ ప్రదేశాల్లో, బావుల వద్ద, భారీ చెట్ల మరుగున ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు, మద్యం సీసాలను, పగిలిన మద్యం బాటిళ్ల పెంకులను పోలీసులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు తొలగించి శుభ్రం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలకు పూనుకున్నట్లు చెప్పారు. పోలీసుల సేవలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.